

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 28-12-2025 సంపుటి : 07 సంచిక 229 పేజీలు : 8 వెల : రూ 3-00


## జిల్లాల పునర్విభజనలో కీలక మార్పులకు సిద్ధమైన ఏపీ ప్రభుత్వం



అమరావతి,డిసెంబరు 27 : జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజనపై మంత్రులు, అధికారులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏపీ సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లాల పునర్విభజనపై సీఎం చంద్రబాబు కీలక సూచనలు చేశారు. ఈ సమావేశంలో ప్రజాభిప్రాయానికే పెద్దపీట వేశారు. జిల్లాల పునర్విభజనలో కొద్దిపాటి మార్పు చేర్పులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈరోజు సమావేశంలో 927 అభ్యంతరాలు, సూచనలపై సీఎం సుదీర్ఘంగా చర్చించారు. ఈ నేపథ్యంలో నెల్లూరు జిల్లాకే గూడూరును కేటాయించాలని నిర్ణయం తీసుకున్నారు. నక్కపల్లి డివిజన్ బదులుగా అడ్డరోడ్డు జంక్షన్, మార్కాపురం జిల్లాకు దొనకొండ, కురిచేడు మండలాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఈ నెల 31న తుది నోటిఫికేషన్‌ను ఏపీ సర్కార్ జారీ చేయనుంది. అయితే, జిల్లాల పునర్విభజనపై ప్రాథమిక నోటిఫికేషన్‌ను నవంబరు 27వ తేదీన ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై నెల రోజుల పాటు అభ్యంతారాలను స్వీకరించింది. అయితే తో గడువు ముగుస్తోంది. ప్రాథమిక నోటిఫికేషన్ అనంతరం వ్యక్తమైన అభ్యంతరాలపై మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా రాజంపేటను కడపలో కలిపి, రాయచోటిని మదనపల్లిలో కలిపే ప్రతిపాదనలపై ప్రభుత్వం కీలక సమాలోచనలు చేసింది. ఇప్పటికే ప్రకటించిన మూడు జిల్లాలతో 29 వరకు జిల్లాల సంఖ్య పెరగాల్సి ఉంది. తాజా ప్రతిపాదనలతో 28 జిల్లాలకే పరిమితం చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ప్రత్యేక జిల్లాగా ప్రకటించిన రాయచోటిని మదనపల్లిలో కలిపే దిశగా సమావేశంలో చర్చ జరిగింది. ఇప్పటికే ప్రకటించిన 3జిల్లాలపై అభ్యంతరాలు, ప్రతిపాదనలపై సమీక్షించారు సీఎం. దొనకొండ, కురిచేడును మార్కాపురం జిల్లాలో.. పొదిలిని ఒంగోలు జిల్లాలో కలిపితే ఎలా ఉంటుందని చర్చించారు. స్థానిక ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు రైల్వే కోడూరును తిరుపతిలో కలిపే అంశంపై కసరత్తు చేశారు. మేరోసారి సమావేశమై ఎల్లుండి మంత్రివర్గం ముందుకు ప్రతిపాదనలు తీసుకురానుంది మంత్రివర్గ ఉపసంఘం. కేబినెట్ ఆమోదం తర్వాత ఈనెల 31వ తేదీన తుది నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. ఈ సమీక్షకు మంత్రులు అనగాని సత్యప్రసాద్, హోంమంత్రి వంగలపూడి అనిత, నారాయణ హాజరయ్యారు.

## తిరుపతి, విజయవాడలకు గ్రేటర్ హోదాపై మంత్రి నారాయణ క్లారిటీ

అమరావతి,డిసెంబరు 27 : తిరుపతి, విజయవాడలకు గ్రేటర్ హోదా కల్పించడానికి కొన్ని ఇబ్బందులు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ క్లారిటీ ఇచ్చారు. జనగణన ఉన్నందున విలీనానికి సంబంధించిన కొన్ని ఇబ్బందులు ఉండటంతో ఈ విషయంపై చర్చించలేదని తెలిపారు. జనగణన జరగబోతోంది కాబట్టి ప్రస్తుతం డీలిమిటేషన్ చేయకూడదనే కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. అందుకే ప్రస్తుతం



గ్రేటర్ విజయవాడ, గ్రేటర్ తిరుపతి ప్రక్రియను కొంతకాలం వాయిదా వేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు మంత్రి నారాయణ.జిల్లాలు, డివిజన్లు, మండలాల పునర్విభజనపై మంత్రులు, అధికారులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏపీ సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు మంత్రి నారాయణ. ఈ సమావేశంలో కొత్త జిల్లాల ఏర్పాటుపై చర్చించామని తెలిపారు. మరోసారి సమావేశమై గ్రేటర్ తిరుపతి, గ్రేటర్ విజయవాడ అంశాలపై కీలక నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారుజరీబు, నాన్ జరీబు భూములపై రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు చేశామని వ్యాఖ్యానించారు. శాటిలైట్ చిత్రాల ఆధారంగా సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు. గన్నవరం విమానాశ్రయం భూములకు సంబంధించి కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చామని అన్నారు. రాజధాని రైతులకు రిటర్నబుల్ ప్లాట్స్‌లో 42మంది మార్పులు కోరారని తెలిపారు. రిటర్నబుల్ ప్లాట్ మార్చుకోవాలనుకునే అన్నదాతలు దరఖాస్తు చేసుకుంటే వాటిని మారుస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

# న్యూ ఇయర్ సెలెబ్రేషన్స్ సందర్భంగా పోలీసుల ఉక్కుపాదం..



న్యూఢిల్లీ: పలు నగరాల్లో న్యూ ఇయర్ వేడుకలు వారం రోజుల ముందే మొదలయ్యాయి. క్రిమినల్ గ్యాంగ్స్ రెచ్చిపోయి ప్రవర్తిస్తున్నాయి. విచ్చలవిడిగా తమ దందా కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే క్రైమ్స్‌ను అరికట్టడానికి ఢిల్లీ పోలీసులు రంగంలోకి దిగారు. 'ఆపరేషన్ అఘాత్ 3.0'ను మొదలుపెట్టారు. నేరాలకు పాల్పడుతున్న క్రిమినల్స్‌ను ఎక్కడికక్కడ అరెస్ట్ చేస్తున్నారు. నిన్న ఒక్క రోజే సౌత్, సౌత్ ఈస్ట్ ఢిల్లీ జిల్లాల్లో 660 మందిని అరెస్ట్ చేశారు. వారినుంచి దజన్ల సంఖ్యలో ఆయుధాలు, లక్షల రూపాయల డబ్బు, అక్రమ మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.న్యూ ఇయర్ సందర్భంగా క్రైమ్స్‌ను అరికట్టడానికి పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. క్రైమ్స్ అధికంగా జరిగే ప్రదేశాల్లో నిన్న ఉదయం మొదలైన సోదాలు ఈ రోజు ఉదయం వరకు కొనసాగాయి. క్రైమ్స్‌కు పాల్పడే అవకాశం ఉందని భావించే వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సౌత్, సౌత్ ఈస్ట్ జిల్లా పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి మరీ క్రిమినల్ రికార్డులు ఉన్న వారిని అరెస్ట్ చేశారు. కేవలం ఒక్క సౌత్ ఈస్ట్ జిల్లాలో మాత్రమే ఏకంగా 285 మంది అరెస్ట్ అయ్యారు. పలు సెక్షన్ల కింద పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.ప్రొవిషన్స్ ఆఫ్ ది ఆర్మ్స్ యాక్ట్, ది ఎక్సైజ్ యాక్ట్, ఎన్‌డీపీఎస్ యాక్ట్, గ్యాంబ్లింగ్ యాక్ట్ కింద ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వారిని అరెస్ట్ చేశారు. ఆపరేషన్ అఘాత్ 3.0 భాగంగా పోలీసులు ఇప్పటి వరకు 2,800 మందిని విచారించారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సెక్యూరిటీ) మీడియాతో మాట్లాడుతూ.. 'డ్రైవ్ విజయవంతం

### ఒకే రోజు 600 మంది అరెస్ట్

అయింది. రెండు జిల్లాలో మొత్తం 850 మందిని అదుపులోకి తీసుకున్నాం. వీరిలో 150కిపైగా మంది చెడు ప్రవర్తన(తరచుగా నేరాలకు పాల్పడేవారు) కలిగిన వారు ఉన్నారు. ఎలాంటి గొడవలు లేకుండా న్యూ ఇయర్ వేడుకలు జరగాలి' అని అన్నారు.

## గుడ్ న్యూస్.. రైల్వే శాఖ సమగ్ర ప్రణాళిక.. 2030 కల్లా..

రైల్వే ప్రయాణికులకు గుడ్ న్యూస్. నానాటికీ పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మౌలిక వసతులను విస్తృత పరిచేందుకు రైల్వే శాఖ రంగంలోకి దిగింది. సమగ్ర ప్రణాళికను అమలు చేసేందుకు రెడీ అయ్యింది. ముఖ్యంగా అర్బన్ ప్రాంతాల్లోని రైళ్ల నిర్వహణకు సంబంధించి మౌలిక వసతుల సామర్థ్యాన్ని రెట్టింపు చేయనున్నారు. 2030 కల్లా పూర్తిస్థాయిలో వసతులను అప్‌గ్రేడ్ చేసేలా రైల్వే శాఖ కసరత్తు చేస్తోంది రైల్వే శాఖ అధికారుల ప్రకారం, ఈ సమగ్ర ప్రణాళికలో భాగంగా వివిధ రైల్వే స్టేషన్‌లల్లో అదనపు ప్లాట్ ఫామ్‌లు, స్టేబ్లింగ్ లైన్స్, పిట్ లైన్స్, అవసరాలకు సరిపడా షంటింగ్ ఫెసిలిటీలను ఏర్పాటు చేయనున్నారు. అర్బన్ ప్రాంతాల్లో అవసరాలను బట్టి కొత్త టర్మినల్స్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. రైళ్ల నిర్వహణ, మరమ్మతుల కోసం మెగా కోచింగ్ కాంప్లెక్స్ సహా వివిధ రకాల మెయింటెనెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.ట్రెయిన్ ఫెసిలిటీ వర్క్స్ ద్వారా స్టేషన్ సామర్థ్యం పెంపు, పెరుగుతున్న రైళ్ల సంఖ్యకు అనుగుణంగా సిగ్నలింగ్, మల్టీట్రాకింగ్ వ్యవస్థను మెరుగుపరచనున్నారు. మొత్తం 48 నగరాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రైల్వే శాఖ నడుం బిగించింది. ప్రధాన స్టేషన్‌లలో పాటు చుట్టుపక్కల ఉన్న స్టేషన్‌లలోనూ మౌలిక వసతులను మెరుగుపరుస్తామని అధికారులు చెప్పారు.ఈ ప్లాన్‌లో భాగంగా సబర్బన్‌తో పాటు దూర ప్రాంతాలను అనుసంధానించే నెట్‌వర్క్‌లను కూడా బలోపేతం చేయనున్నారు. ఆయా నగరాల్లో డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యేక ప్లాన్‌ను కూడా సిద్ధం చేస్తున్నారు.

## గురు గోవింద్ సింగ్ మనల్ని సత్యం, న్యాయం, ధర్మం కోసం నిలబడమన్నారు: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: డిసెంబర్ 27: శ్రీ గురు గోవింద్ సింగ్ జీ మహారాజ్ జన్మదినం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. మనల్ని సత్యం, న్యాయం, ధర్మం కోసం నిలబడమని, మానవ గౌరవాన్ని కాపాడమని



ప్రేరేపించారని... ధైర్యం, కరుణ, త్యాగానికి ప్రతీక. గురుజీ జీవితం, ఆయన బోధనలు తరతరాలను సేవ, నిస్వార్థ కర్తవ్యం వైపు నడిపిస్తాయని మోదీ చెప్పారు. ఈ సందర్భంగా.. ఈ ఏడాది, పాట్నాలోని సాహిబ్ తఖ్త్ శ్రీ హరిమందిర్‌ని సందర్శించుకున్న జ్ఞాపకాలను మోదీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. అక్కడ గురుజీ, మాతా సాహిబ్ కౌర్ జీ.. పవిత్ర జోరే సాహిబ్ దర్శనం చేసుకున్నట్లు మోదీ తెలిపారు. అప్పటి ఫొటోలను మోదీ తన ఎక్స్ ఖాతా ద్వారా షేర్ చేశారు.ఇలా ఉండగా, గురు గోవింద్ సింగ్ జన్మదినం పురస్కరించుకుని ఇవాళ దేశంలోని గురుద్వారాలు అందంగా ముస్తాబయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు గురుద్వారాలు సందర్శిస్తున్నారు. ఆనంద్ పాఠ్, ప్రభాత్ ఫేరీలతో ఈ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ముందు రోజు (డిసెంబర్ 26) వీర్ బాల్ దివస్‌ను జరుపుకున్నారు.సాహిబ్జాదా జోరావర్ సింగ్, ఫతేహ్ సింగ్‌ల త్యాగాన్ని స్మరించుకుంటూ.. గురు గోవింద్ సింగ్ జీ బోధనలు ఈనాటి సమాజానికి మార్గదర్శకాలు అని చెప్పారు.

## కత్తి తీస్తే కటకటాలకే.. గుర్తుపెట్టుకోండి.. వైసీపీకి హోంమంత్రి హెచ్చరిక

అమరావతి, డిసెంబర్ 27: మాజీ సీఎం జగన్ పుట్టిన రోజు సందర్భంగా వైసీపీ నేతలు, కార్యకర్తల వికృత చేష్టలపై హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడైనా పుట్టినరోజు కేకులను వేటకొడవళ్లు, తల్వార్లతో కట్ చేస్తారా అని ప్రశ్నించారు. నడిరోడ్లపై అకారణంగా మూగజీవాల ఉసురు తీసి బలులు, రక్తాభిషేకాలు చేశారని మండిపడ్డారు. వైసీపీ సైకో మూక వికృత చేష్టలు చూస్తుంటే మానవత్వం ఉందా లేదా అనిపిస్తోందన్నారు. అధికారం కోల్పోయిన తరువాత కూడా రాజకీయ ముసుగులో రౌడీయిజం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడానికి వైసీపీ ముఠా ఎంతకైనా దిగజారుతోందని వ్యాఖ్యలు చేశారు. మూగ జీవాలను బలి తీసుకుని సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న వైసీపీ పార్టీ ఉన్మాదాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. కళ్యాణదుర్గం, ఉరవకొండ, శింగనమల, రాప్తాడు, కదిరి, పుట్టపర్తి, ధర్మవరం, కుప్పం, గోపాలపురం... ఇలా పలుచోట్ల మేక తలలు నరికి బహిరంగంగా నెత్తురు చల్లిన సంఘటనలు ఉన్నాయన్నారు.



మీరు చేస్తున్నది తప్పు అని చెప్పిన గర్భిణీ స్త్రీ మీద వైసీపీ మూక ఉన్మాదుల మాదిరి దాడులు చేశారని ఫైర్ అయ్యారు. గర్భిణి మీద వైసీపీ సైకో దాడి జరిగితే ఈ రోజు వరకు జగన్మోహన్ రెడ్డి తప్పు అని ఖండించలేదన్నారు. గర్భిణీపై దాడి చేసిన కేసులో నీచుడిని అరెస్ట్ చేస్తే జనసేన కార్యకర్త అని మరో విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అతను జనసేన కార్యకర్త అయితే జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలలో ఎందుకు పాల్గొంటారని ప్రశ్నించారు.జగన్మోహన్ రెడ్డి రాజకీయ పబ్బం కోసం 20 ఏళ్ళ లోపు యువతని బలితీసుకుంటున్నారని విమర్శలు గుప్పించారు. అధికారంలో ఉన్నప్పుడు డ్రగ్స్‌కు బానిసలుగా మార్చి రాష్ట్ర యువత భవితను నాశనం చేశారని.. ఇప్పుడు రప్పా రప్పా అంటూ వైసీపీ ముఠా యువతను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. రప్పా రప్పా అంటే జైలుకు పంపడం ఖాయమని స్పష్టం చేశారు.




# సంపాదకీయం

ఆదివారం 28-12-2025

## టాలీవుడ్ లో డ్రెస్సింగ్ వార్

సినిమా ఇండస్ట్రీ అన్నాక వివాదాలు కొత్తేమీ కాదు. కానీ, ఇద్దరు పాపులర్ సెలబ్రిటీల మధ్య మాటల యుద్ధం జరిగితే అది సోషల్ మీడియాలో సెన్సేషన్ అవుతుంది. రీసెంట్‌గా టాలీవుడ్ సీనియర్ హీరో, బిగ్ బాస్ ఫేమ్ శివాజీ మరియు స్టార్ యాంకర్ అనసూయ భరద్వాజ్ మధ్య జరిగిన వివాదం టాలీవుడ్‌లో హాట్ టాపిక్ అయింది. మహిళలు, హీరోయిన్ల డ్రెస్సింగ్ గురించి శివాజీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. శివాజీని కొందరు సమర్థిస్తే, కొందరు విమర్శించారు. శివాజీకి అనసూయ కూడా కౌంటర్ ఇచ్చారు. తాను చేసిన వ్యాఖ్యలపై దీనికి ఆయన వివరణ కూడా ఇచ్చుకున్నారు. అయితే ఇది ఇంతటితో ఆగలేదు. తాజాగా అనసూయ మరో సంచలన ట్వీట్ చేసింది.'కొంతమంది పురుషులు.. ఇంకా కొంతమంది మహిళలు కూడా.. నా వయసును ఉపయోగించి నన్ను తక్కువగా చూపించడానికి.. నన్ను చిన్నగా భావింపజేయడానికి ప్రయత్నిస్తున్నారు.. ఈ విధమైన ఆలోచన కలిగిన వారు ఎక్కువగా ప్రగతిశీల మహిళలను లక్ష్యంగా చేసుకుంటారు.. ఇది మహిళలపై నియంత్రణ కోల్పోతామన్న భయం వల్ల.. అలాగే బలహీనమైన పితృస్వామ్య అహంకారాన్ని పోషించుకోవాలనే ఉద్దేశంతో జరుగుతుంది. ఇది అందరి పురుషుల గురించీ లేదా అందరి మహిళల గురించీ కాదు. కానీ నేను పురుషులు.. మహిళలు.. అందరికీ విన్నపం చేస్తున్నాను.. దయచేసి విస్తృతంగా ఆలోచించండి. పాత తరాలు నేర్చుకున్నవి లేదా అలవాటుపడ్డ ఆలోచనలు మనం తప్పనిసరిగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం లేదు. మనం మార్పును ఎంచుకోవచ్చు. మన హీరోయిన్లు వేసుకొనే బట్టలు చూస్తే మనకే దరిద్రమనిపిస్తుంటుంది. హీరోయిన్లు ఏమనుకొన్నా పర్వాలేదు. మీ అందం నిండుగా కట్టుకొనే చీరలో.. నిండుగా కప్పుకొనే దుస్తుల్లోనే ఉంటుంది తప్పితే.. సామాన్లు కనపించే దుస్తుల్లో ఉండదు. మీరు అర్ధనగ్నంగా కనిపించే దుస్తులు వేసుకొన్నప్పుడు చాలా మంది మీ ముందు నవ్వుతారు. కానీ మనసులో దరిద్రపు ముండ ఇలాంటి బట్టలు ఎందుకు వేసుకొంటారు? కొంచెం మంచి బట్టలు వేసుకొంటే బాగుంటుంది కదా అని లోపల అనాలనిపిస్తుంది. ఆ మాటలు బయటకు అనలేం. స్త్రీ అంటే ప్రకృతి.. ఎంత అందంగా ఉంటే.. అంత గౌరవం పెరుగుతుంది. ప్రకృతి మాదిరిగానే మా అమ్మ సావిత్రి, సౌందర్య మాదిరిగా చక్కగా కనిపిస్తుంటుంది. గ్లామర్ ఒక దశ వరకే ఉండాలి. కానీ హద్దు మీరి ఉండకూడదు. స్వేచ్ఛ అనేది అదృష్టం. మనం వేష, భాషల వల్లే గౌరవం, స్వేచ్ఛ లభిస్తుంది. చీరకట్టు మహిళలకే విశ్వసుందరి అవార్డులు లభించాయి అని శివాజీ అన్నారు.మన గౌరవాన్ని.. మన స్వేచ్ఛను కాపాడుకోవచ్చు.. ఒకరికొకరం శక్తినివ్వాలి.. మద్దతుగా నిలవాలి.. మన విలువ మన ఎంపికల నుంచే వస్తుంది.. మరే దానితో కాదు. అంతేకాకుండా కొంతమంది మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.. మీ పని బాధ్యతతో చేయాలి.. ఈ విధమైన మహిమాపరచడం సమంజసం కాదు, అభినందనీయం కాదు.అలాగే.. జరుగుతున్న ప్రతిదానితో సంబంధం లేకుండా.. నేను ఎల్లప్పుడూ అండగా నిలుస్తాను.. బాధపడకుండా.. ప్రభావితం కాకుండా.. తాకబడకుండా.. మరియు బలంగా.. ఈ మొత్తం సంభాషణ చాలా కాలంగా వినబడని మరియు నిర్లక్ష్యం చేయబడిన సమాజంలోని ఒక వర్గాన్ని సూచించడం గురించి మాత్రమే..చివరికి నేను ఎల్లప్పుడూ అలాగే జీవిస్తాను, చెబుతాను. ఇంకొక్కటి లాస్ట్ చెప్తా ఈరోజుకి.. ఉన్న ఇష్యూ నీ అడ్రస్ చేయటం చేతగాక నా గురించి, వయసు గురించి ప్రస్తావించడం సిగ్గు చేటు. ఆంటీ అంటున్న మగవాళ్ళు, ఆడవాళ్ళు..ఆయన్ని మాత్రమే గారు అంటున్నరు.. నాకు 40, ఆయనకు 54 అనుకుంటా. పర్సనల్ గా నో ఫిట్‌నెస్ ని “గ్లామర్” ని మెయింటెయిన్ చేస్తున్నాం.. ఈ అనేవాళ్ళందరూ నిత్య యవ్వనులు అది వేరే విషయం అనుకోండి. సర్లెండి.. ఇంకా ఇంతకంటే ఏం చెప్పిన చెవిటోడి ముందు శంఖం ఊదినట్టే.. మెర్రీ క్రిస్మస్!! ఇది మరొక రోజు.. మంచి ఆహారం తీసుకోండి.. మన ప్రియమైన వారితో సంతోషకరమైన సమయాన్ని గడపండి” అని రాసుకొచ్చింది అనసూయ. మరో ఇంద్రజ మాట్లాడుతూ.. “నా బాడీ నా ఇష్టం. నాకు నచ్చిన డ్రెస్ నేను వేసుకున్నాను.. నువ్వు ఎందుకు అడుగుతున్నావు అని చాలా మంది ప్రశ్నిస్తున్నారు. కానీ నీ ఇష్టం అని పబ్లిక్ గా బట్టలు వేసుకుని రావడం.. జనాల మధ్యలో.. మీడియాలో నీ ఫోటోస్, వీడియోస్ పెట్టడం నీకు ఎంత హక్కు ఉందని నువ్వు అంటున్నావో.. న డ్రెస్సింగ్ అభ్యంతకరంగా.. చీప్ గా ఉన్నప్పుడు దాని గురించి అడిగే హక్కు కూడా ఎదుటివారికి ఉంటుంది. పబ్లిక్ లో ఇలా ఉండాలని ఒకటి ఉంటుంది. ఇంట్లో ఉన్నట్లు.. ఇంట్లో మాట్లాడినట్లు బయట ఉంటాను అంటే కుదరదు. పబ్లిక్ లో ఎలా ఉండాలి అనేది ఒక కోడ్ ఉంటుంది. అది నీ ఇష్టం నేను వేసుకుంటాను అంటే.. ఓకే కానీ.. వేసుకున్నాక కామెంట్స్ చేయొద్దు అనే రైట్స్ మాత్రం నీకు లేవు” అని అన్నారు“అసభ్యకరమైన బట్టలు మీ పబ్లిక్ లో కాదు.. మీ పర్సనల్ ప్లేస్ లో వేసుకోండి.. పబ్లిక్ లో వేస్తే అలాగే కామెంట్స్ చేస్తారు. అన్నింటినీ భరిస్తేనే బయట అలాండి డ్రెస్సింగ్ వేసుకోండి. లేదంటే వేసుకోవద్దు. కొందరి డ్రెస్సింగ్ చూస్తే ఇవేమి డ్రెస్సులు అనిపిస్తుంది. అలాంటి కాస్ట్యూమ్స్ తో ఎలా కంఫర్ట్ గా ఉంటారు అనిపిస్తుంది. అందంగా ఉండాలి.. ట్రెండింగ్ గా ఉండాలి. కానీ ఛీ అనేలా ఉండకూడదు. సెలబ్రిటీలు ఈ విషయంలో స్ట్రిక్ట్ గా ఉండాలి. మిమ్మల్ని చూసి ఫాలో అయ్యేవాళ్ళు ఉన్నారు కాబట్టి.

## 5వేల మంది డాక్టర్లు, 11 వేల మంది ఇంజినీర్లు.. గత రెండేళ్లలో పాకిస్థాన్‌ను విడిచివెళ్లారు



న్యూఢిల్లీ: పాకిస్థాన్‌లో తీవ్ర రాజకీయ సంక్షోభం ఆ దేశ ఆర్థిక సంక్షోభానికి దారి తీస్తున్నది. వేల సంఖ్యలో నైపుణ్యం ఉన్న ఉద్యోగులు దేశాన్ని విడిచి వెళ్తున్నారు. గత రెండేళ్లలో ఆ సంఖ్య మరింత రెట్టింపు అయినట్లు తెలుస్తోంది. కొనసాగుతున్న రాజకీయ అనిశ్చిత వల్ల.. దేశ ఆర్థిక పరిస్థితి కూడా దిగజారిపోతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గత రెండేళ్లలో 5000 మంది డాక్టర్లు, 11000 మంది ఇంజినీర్లు, 13000 మంది అకౌంటెంట్లు పాకిస్థాన్‌ను వీడి వెళ్లినట్లు ఓ ప్రభుత్వ నివేదిక ద్వారా వెల్లడైంది. బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ అండ్ ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ఈ డేటాను రిలీజ్ చేసింది. అయితే ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీ .. ఈ వలసలను బ్రెయిన్ గెయిన్‌గా వర్ణించారు. నిజానికి బ్రెయిన్ డ్రెయిన్ అవుతున్న విషయాన్ని పాకిస్థాన్ గ్రహించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. పాకిస్థాన్ మాజీ సేనేటర్ ముస్తాఫా నవాజ్ కోకర్ ఈ రిపోర్టును ప్రస్తావించారు. దేశ ఆర్థిక వ్యవస్థను సరిచేయాలంటే ముందుగా రాజకీయ వ్యవస్థను సరిచేయాలన్నారు. ఇంటర్నెట్ షట్‌డౌన్ ద్వారా దేశానికి 1.62 బిలియన్ల డాలర్ల నష్టం వచ్చిందన్నారు.

## కర్ణాటకలో 200కు పైగా ఇళ్లు కూల్చివేత.. నిరాశ్రయులైన 400 ముస్లిం కుటుంబాలు

బెంగళూరు: కర్ణాటకలో 200కుపైగా ఇళ్లను అధికారులు కూల్చివేశారు. దీంతో సుమారు 400 ముస్లిం కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. ఉత్తరాది రాష్ట్రాల బుల్డోజర్ చర్యను ఇక్కడ అమలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. డిసెంబర్ 22న తెల్లవారుజామున 4 గంటల సమయంలో బెంగళూరు శివారు కోగిలు గ్రామంలోని ఫకీర్ కాలనీ, వాసిం లేఅవుట్‌లోని సుమారు 200కు పైగా ఇళ్లను అధికారులు కూల్చివేశారు. బెంగళూరు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ నిర్వహించిన ఈ డ్రైవ్‌లో నాలుగు జేసీబీలు వినియోగించారు. 150 మందికి పైగా పోలీసు సిబ్బందిని మోహరించారు. ఉర్దూ ప్రభుత్వ స్కూల్‌కు ఆనుకుని ఉన్న సరస్సు ప్రాంతంలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్నారని కర్ణాటక ప్రభుత్వం ఆరోపించింది. ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది.కాగా, వందల సంఖ్యలో ఇళ్లను కూల్చివేయడంతో సుమారు 400కు పైగా కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. వీరిలో ఎక్కువగా ముస్లిం కుటుంబాలే ఉన్నాయి. తమకు ముందస్తు నోటీసు అందలేదని, పోలీసులు బలవంతంగా తమను ఖాళీ చేయించి ఇళ్లను కూల్చివేశారని నివాసితులు ఆరోపించారు. తీవ్ర చలికాలంలో వృద్ధులు, పిల్లలతో పాటు వందలాది మంది తాత్కాలిక గుడారాల కింద తలదాచుకుంటున్నట్లు వాపోయారు.మరోవైపు ఇళ్ల కూల్చివేతల నేపథ్యంలో కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో అమలు చేస్తున్న బుల్డోజర్ రాజ్యాన్ని ఇక్కడ అమలు చేస్తున్నారని వామపక్ష పార్టీలు మండిపడ్డాయి. కేరళ సీఎం పినరయి విజయన్ దీనిపై సీరియస్‌గా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ ‘మైనారిటీ వ్యతిరేక’ రాజకీయాలకు పాల్పడుతున్నదని ఆయన విమర్శించారు.



## బీహార్‌లో కొత్తగా నిర్మించిన రోప్‌వే.. ట్రయల్ రన్‌లో కూలింది

పాట్నా: బీహార్‌లో కొత్తగా రోప్‌వే నిర్మించారు. అయితే ట్రయల్ రన్ సందర్భంగా అది కూలిపోయింది. అక్కడున్న కార్మికులు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. ఈ సంఘటన నేపథ్యంలో రోప్‌వే నిర్మాణం నాణ్యతపై ఆరోపణలు వెల్లువెత్తాయి. బీహార్‌లోని రోహ్తాస్ జిల్లాలో కొత్తగా రోప్‌వే నిర్మించారు. రోహ్తాస్ బ్లాక్ నుంచి రోహ్తాస్ గఢ్ కోట, రోహితేశ్వర్ ధామ్ వరకు రోప్‌వే ఏర్పాటు చేశారు.కాగా, నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. దీంతో రోప్‌వే ప్రారంభించే ముందు శుక్రవారం ట్రయల్ రన్ నిర్వహించారు. అయితే ఒక కేబుల్ చిక్కుకుపోవడంతో ఆ రోప్‌వే కూలిపోయింది. ట్రయల్ రన్ కోసం వినియోగించిన నాలుగు ట్రాలీలు చాలా ఎత్తునుంచి కిందపడి ధ్వంసమయ్యాయి. అయితే అందులో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. అక్కడ పని చేస్తున్న కార్మికులు కూడా ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు.మరోవైపు కొత్తగా నిర్మించిన రోప్‌పై కూలిపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. రోప్‌వే నిర్మాణ నాణ్యతపై పలు ఆరోపణలు వచ్చాయి. రోప్‌వే కూలడంపై నిపుణుల బృందంతో దర్యాప్తు చేస్తామని ఇంజినీరింగ్ అధికారి తెలిపారు. ట్రయల్ రన్ ఫలితాలపై పూర్తిగా సంతృప్తి చెందే వరకు రోప్‌వేను ప్రజలకు అందుబాటులోకి తీసుకురాబోమని అన్నారు.



## పోషకాహారంతో తల్లీబిడ్డ క్షేమం : సీడీపీఓ లక్ష్మీప్రసన్న

లక్ష్మిదేవిపల్లి, డిసెంబర్ 27 : పోషకాలు ఉన్న ఆహారం తీసుకుంటే తల్లి బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ లక్ష్మి ప్రసన్న అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మిదేవిపల్లి మండలం ప్రశాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. సర్పంచ్ లైలా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని, ఇక్కడే భోజనం చేసి పిల్లలు గుడ్లు తినేలా చూడాలన్నారు. అన్ని పోషకాలు ఉన్న ఆహారం ఐసీడీఎస్‌లోనే ఉంటుందని తెలిపారు. తన వంతు సహకారం తప్పక ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీను, సూపర్‌వైజర్ రమాదేవి, టీచర్లు సుజాత. సెక్టార్ టీచర్లు. హెల్పర్లు పాల్గొన్నారు.



## వైకుంఠ ఏకాదశి (ముక్కోటి) మహోత్సవ ఆహ్వానం.




విభారే న్యూస్ డిసెంబర్ 27 ఎమ్మిగనూరు..30 వ తేదీ మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణం మంత్రాలయం రోడ్డులో వెలసిన శ్రీ శ్రీ శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయం వైకుంఠ ఏకాదశి కన్నుల పండుగగా నిర్వహించబడును. ఈ మహోత్సవమునకు భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని అనంత పద్మనాభ స్వామి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ నిర్వాహకులు గొల్ల గోపాల్ భక్తులను కోరారు.

## శ్రీ జంబులమ్మ దేవాలయంలో కుర్ని కుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ..



విభారే న్యూస్ ఎమ్మిగనూరు డిసెంబర్ 27.. పట్టణ కుర్ని కుల సంఘం ఆధ్వర్యంలో 2026 నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. శనివారం ఎమ్మిగనూరు పట్టణంలోని సోగనూరు రోడ్డు లో శ్రీ జంబులమ్మ దేవి దేవాలయం ముందు శ్రీ జంబులమ్మ దేవి దేవాలయం ధర్మకర్త,మాజీ కౌన్సిలర్,మాజీ టౌన్ బ్యాంక్ డైరెక్టర్,రియల్ ఎస్టేట్ వ్యాపారి తట్టే బుడ్డప్ప చేతుల మీదుగా నూతన క్యాలెండర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా తట్టే బుడ్డప్ప మాట్లాడుతూ కుర్ని కులస్థులు సామాజికంగా,రాజకీయంగా,ఆర్థికంగా రాణించి విద్య వైద్య ఉపాధి రంగాలలో ప్రతిభ ను చాటాలి. అలాంటప్పుడే సమాజంలో మనకు గుర్తింపు ఉంటుంది. కార్యక్రమంలో ఎమ్మిగనూరు పట్టణ కుర్ని కుల సంఘం నాయకులు మందుగుండు నీలకంఠప్ప,బుగిడే తిమ్మప్ప, మైలే గణేష్, చేనేత మల్లికార్జున, హౌస్ బిల్డింగ్ సొసైటీ మాజీ డైరెక్టర్ కాకే రామన్న, తట్టే ఆదినారాయణ,తట్టే అనిల్, కేసి నారాయణ,మోనే రంగప్ప, అగ్గునూరు ఏకాంబరి,మందుగుండు సోమేష్ పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలపై తనిఖీలు--

### రూ 10 లక్షల నిల్వల విక్రయాల నిలుపుదల--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబరు 27నంద్యాల జిల్లా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు శనివారం ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సుదర్శన్ ట్రేడర్స్, లక్ష్మి వెంకటేశ్వర ట్రేడర్స్, సేగు శ్రీనివాసులు అండ్ బ్రదర్స్ దుకాణాలను పరిశీలించారు. తనిఖీల్లో స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, అనుమతి పత్రాలు, యూరియా నిల్వలు, రోజువారీ అమ్మకాల వివరాలను అధికారులు పరిశీలించారు.సరైన ధృవ పత్రాలు లేని కారణంగా పలు బయో ఉత్పత్తులు, ఎరువుల కంపెనీలకు సంబంధించిన సుమారు పది లక్షల రూపాయల విలువైన ఉత్పత్తుల విక్రయాలను తాత్కాలికంగా నిలిపివేశారు.ఈ సందర్భంగా ప్రసాద్ రావు మాట్లాడుతూ యూరియా వివరాలను ప్రతిరోజూ బోర్డులో నమోదు చేయాలని, ఎంఆర్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వ అనుమతి పొందిన ఎరువులనే విక్రయించాలని దుకాణదారులకు సూచించారు.



## కోతుల రాజ్యం.. అధికారులు మౌనం--

### బడ్జెట్ ఉన్నా చర్యలు శూన్యం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 27–పట్టణంలో కోతుల బెడద రోజురోజుకు తీవ్ర రూపం దాలుస్తోంది. వీధులు, నివాస కాలనీలు, అపార్టుమెంటులలో . మార్కెట్ ప్రాంతాలు అన్న తేడా లేకుండా కోతులు విజృంభిస్తున్నాయి. ఇళ్లలోకి దూరి వస్తువులు ధ్వంసం చేయడం, పిల్లలు, మహిళలు, వృద్ధులను భయపెట్టడం వల్ల పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కోతుల నివారణకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించినప్పటికీ, ఆ మేరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పట్ల పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది.కోతుల సమస్యతో పాటు వీధి కుక్కల నియంత్రణలో కూడా మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వారానికి రెండు మూడు రోజులు మాత్రమే కుక్కల నియంత్రణ చర్యలు చేపడుతున్నారని, అవీ పేరుకే పరిమితమవుతున్నాయని ప్రజలు అంటున్నారు. శానిటేషన్ అధికారులు పట్టీ పట్టనట్టు వ్యవహరిస్తుండటంతో పట్టణ ప్రజల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని విమర్శిస్తున్నారు.కేటాయించిన బడ్జెట్‌ను వెంటనే వినియోగించి, కోతులు మరియు వీధి కుక్కల నియంత్రణకు సమగ్ర చర్యలు చేపట్టాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఉద్యమాలకు దిగాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

## అర్బన్ బిఎల్ఓలతో సమీక్ష--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబరు 27:నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం అర్బన్ బూత్ లెవల్ అధికారులతో ఓటరు జాబితాల ప్రత్యేక సవరణపై అవగాహన మరియు సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ బి శేషన్న ఏఈఆర్ఓ నంద్యాల, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శేకర్ కలిసి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ బి శేషన్న మాట్లాడుతూ, ఓటరు జాబితాల ప్రత్యేక సవరణను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని అర్బన్ బిఎల్ఓలకు సూచించారు. ఇంటింటి పరిశీలన పూర్తిస్థాయిలో జరగాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.మరణించిన వారి పేర్ల తొలగింపు, ద్విప్రతుల నివారణ, చిరునామా మార్పులు, కొత్త ఓటర్ల నమోదు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శేకర్ మాట్లాడుతూ, ఓటరు జాబితాల ఖచ్చితత్వమే ప్రజాస్వామ్యానికి పునాదని అన్నారు. అర్బన్ ప్రాంతాల్లో బిఎల్ఓలు మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అర్బన్ బిఎల్ఓలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధనుర్మాసంలో స్వామివారికి విశేష స్నప్న తిరుమంజనం

### --మద్దులేటి లక్ష్మీ నృసింహా స్వామి దేవస్థానంలో భక్తి పరవశం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 27–నంద్యాల పట్టణంలోని తెలుగు పేటలో గల శ్రీ ఘణ మద్దులేటి లక్ష్మీ నృసింహా స్వామి దేవస్థానంలో ధనుర్మాసం నెలలో రెండో శనివారం సందర్భంగా శుక్రవారం ఉదయం స్వామివారికి అత్యంత వైభవంగా స్నప్న తిరుమంజనం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మూలమూర్తి శ్రీ మద్దులేటి లక్ష్మీ నృసింహా స్వామి వారికి వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో ప్రాతఃకాల అభిషేకం నిర్వహించారు. అనంతరం దాతల గోత్రనామాలతో ప్రత్యేక అభిషేక పూజలు జరిపి, నైవేద్య నమర్పణ చేసి, మంగళహారతి నిర్వహించారు.ధనుర్మానం పవిత్రతను పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తిశ్రద్ధలతో మార్మోగింది.



# 29న జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్స్--

### ప్రజల అర్జీలకు తక్షణ పరిష్కారం--
### 7 విభాగాల్లో రెవెన్యూ సేవలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబరు 27 :–జిల్లాలో ప్రజల రెవెన్యూ సంబంధిత సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించేందుకు ఈ నెల 29వ తేదీ సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా తెలిపారు.కలెక్టరేట్ ఆవరణలో మొత్తం 7 రెవెన్యూ క్లినిక్స్ ఏర్పాటు చేసి ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరిస్తామని తెలిపారు. సమస్య స్వరూపాన్ని బట్టి అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపడతామని పేర్కొన్నారు.ఈ క్లినిక్స్‌లో ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహశీల్దార్లు హాజరై ప్రజలకు సేవలు అందిస్తారని తెలిపారు.రెవెన్యూ క్లినిక్స్ విభాగాలుక్లినిక్?1: రెవెన్యూ, గ్రామ, వార్డు సచివాలయ సేవలుక్లినిక్?2: అడంగల్ నవరణలుక్లినిక్?3: 22ఎ, చుక్కల భూముల క్రమబద్ధీకరణక్లినిక్?4: అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలుక్లినిక్?5: రెవెన్యూ కోర్టు, ఆర్ఓఆర్ కేసులుక్లినిక్?6: సర్వే, రీ?సర్వే సమస్యలుక్లినిక్?7: దేవాదాయ, వక్ఫ్ భూముల అంశాలుప్రజలు తమ రెవెన్యూ సమస్యలకు సంబంధించిన అర్జీలను నేరుగా సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.



## జిల్లా తైక్వాండోలో నంద్యాల విద్యార్థుల ప్రతిభ--

### క్రమశిక్షణే విజయానికి మూలం--
### డాక్టర్ రవి కృష్ణ---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 27–ఇటీవల నంద్యాలలో నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో ఓపెన్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను నంద్యాల క్రీడా సమాఖ్య కార్యాలయంలో ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ ఒలింపిక్ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ అభినందించారు.కోచ్‌లు సర్దార్ అలీ ఖాన్, షానవాజ్‌ల వద్ద శిక్షణ పొందిన ఎస్ డి ఆర్ స్కూల్, బాలాజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్, బాల అకాడమీ, ఎల్ కె ఆర్ గ్లోబల్ స్కూల్, జ్యోతిర్మయి పాఠశాల, శ్రీ చైతన్య స్కూల్, ఉస్మానియా ఇంగ్లీష్ మీడియం స్కూల్, మున్సిపల్ హై స్కూల్‌లకు చెందిన విద్యార్థులు వివిధ కేటగిరీల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించారు.ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక స్థైర్యం పెరుగుతాయని అన్నారు. క్రమశిక్షణతో కూడిన నిరంతర సాధన, మంచి కోచ్‌ల మార్గదర్శనం ఉంటే క్రీడల్లో విజయం సాధించడం సులభమవుతుందన్నారు. జిల్లా స్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.అనేక సంవత్సరాలుగా తైక్వాండోలో శిక్షణ ఇస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకొస్తున్న కోచ్‌లు సర్దార్ అలీ ఖాన్, షానవాజ్‌ల సేవలను డాక్టర్ రవి కృష్ణ ప్రత్యేకంగా ప్రశంసించారు.



## కమ్యూనిస్టుల ఐక్యతే దేశ రక్షణ--

### సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 27–నంద్యాలసిపిఐ శతజయంతి ఉత్సవాల సందర్భంగా నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించిన సదస్సులో సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ మాట్లాడుతూ దేశ రక్షణకు కమ్యూనిస్టుల ఐక్యత అనివార్యమని పిలుపునిచ్చారు.బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తులు రాజ్యాంగాన్ని మార్చాలనే ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కమ్యూనిస్టుల త్యాగాల వల్లే దేశానికి స్వేచ్ఛ లభించిందని తెలిపారు. మోడీ పాలనలో రూపాయి విలువ పడిపోగా నిత్యావసర ధరలు పెరిగి ప్రజలు నష్టపోతున్నారని అన్నారు.కార్మికుల హక్కులను దెబ్బతీసేలా 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చారని ఆరోపించారు. స్వయం ప్రతిపత్తి సంస్థలను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు.సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు, పి. రామచంద్రయ్య మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలన్నీ ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో టిడిపి, వైసిపిలకు ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టులు మూడవ శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## రాహుల్ ప్రధాని అయితే స్టీల్ ప్లాంట్ కాపాడుకోవచ్చు

విజయవాడ, డిసెంబర్ 27 విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ అంశంపై తెలంగాణ పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఏపీకి న్యాయం జరగాలన్నా, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆగాలన్నా రాహుల్ గాంధీ ప్రధాని కావాలని జగ్గారెడ్డి అన్నారు. రాజకీయంగా నష్టం జరుగుతుందని తెలిసినా సోనియా గాంధీ విభజన హామీని నిలబెట్టుకున్నారు. 2029 ఎన్నికల్లో ఏపీ ప్రజలు కాంగ్రెస్‌కు 20 నుండి 25 ఎంపీ సీట్లు ఇస్తే, రాహుల్ గాంధీ ప్రధాని అవుతారు. అప్పుడు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేసి, కాంగ్రెస్ తన మాట నిలబెట్టుకుంటుందని జగ్గారెడ్డి తెలిపారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనేది ఒక చారిత్రాత్మక నినాదమని, వేలాది మంది ప్రజల పోరాటాలు, త్యాగాల ఫలితంగానే ఈ కర్మాగారం ఏర్పడిందని ఆయన గుర్తు చేశారు. విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఏపీ రాజకీయాలు, స్టీల్ ప్లాంట్ భవిష్యత్తుపై మాట్లాడారు. 1970లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ పార్లమెంటులో ఇచ్చిన మాట ప్రకారం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి జాతికి అంకితం చేశారని జగ్గారెడ్డి గుర్తు చేశారు. రూ. 14 వేల కోట్లతో ప్రారంభమైన ఈ ప్లాంట్ విలువ నేడు రూ. 2.5 లక్షల కోట్లకు చేరిందని పేర్కొన్నారు. లక్షలాది కుటుంబాలకు జీవనాధారంగా ఉన్న ఈ సంపదపై ప్రధాని మోడీ కన్ను పడిందని, దీనిని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. గతంలో యూపీఏ ప్రభుత్వం నష్టాలను భర్తీ చేస్తూ ప్లాంట్‌ను కాపాడుకుంటూ వచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు, వైఎస్ జగన్ ఇద్దరూ స్టీల్ ప్లాంట్‌ను కాపాడటంలో విఫలమయ్యారని జగ్గారెడ్డి విమర్శించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కేంద్రంలో చక్రం తిప్పే అవకాశం ఉన్నా, మోడీతో సన్నిహిత సంబంధాలు ఉన్నా ప్లాంట్‌ను ఎందుకు కాపాడలేకపోతున్నారని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు మోడీతో దోస్తీ చేసిన జగన్, ప్రైవేటీకరణను ఎందుకు ఆపలేకపోయారని నిలదీశారు.

## సంక్రాంతికి పేదల ఇంట గోధుమ పిండి--

### కిలో ఇరవై రూపాయలకే రేషన్ లో చక్కీ గోధుమ పిండి---
### డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద రావు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 27–సంక్రాంతి పండగను పేదలు సైతం ఆనందంగా జరుపుకునేలా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రేషన్ షాపుల ద్వారా నాణ్యమైన చక్కీ గోధుమ పిండిని రాయితీ ధరకు అందించేందుకు చర్యలు చేపట్టింది.ప్రభుత్వ నిర్ణయం మేరకు గోధుమ పిండి కిలో ప్యాకెట్ ధరను కేవలం ఇరవై రూపాయలుగా నిర్ణయించారు. ఈ గోధుమ పిండి నాణ్యతతో ఉండి వినియోగానికి అనుకూలంగా ఉంటుందని అధికారులు తెలిపారు.జనవరి ఒకటి నుంచి ప్రతి రేషన్ కార్డుకు ఒక కిలో చొప్పున గోధుమ పిండి పంపిణీ చేసేందుకు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ అన్ని ఏర్పాట్లు చేస్తోంది.ఈ పథకం వల్ల సంక్రాంతి పండగకు పేద కుటుంబాలు పిండి వంటలు చేసుకునే అవకాశం లభిస్తుందని సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.



## 31న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం--

### చైర్‌పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన సమీక్ష---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబరు 27--నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 31వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్నట్లు మున్సిపల్ అధికారులు అధికారికంగా ప్రకటించారు. ఈ సమావేశం చైర్‌పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ బి శేషన్న ఆధ్వర్యంలో జరగనుంది.ఈ సమావేశానికి సంబంధించి పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్య నిర్వహణ, త్రాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, పన్నుల వసూళ్లు తదితర ముఖ్య అంశాలతో కూడిన అజెండాను సిద్ధం చేసినట్లు కమిషనర్ బి శేషన్న తెలిపారు.మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అజెండాలోని ప్రతి అంశంపై సమగ్రంగా చర్చించి పట్టణ అభివృద్ధికి దోహదపడే కీలక నిర్ణయాలు తీసుకోవడం ప్రధాన లక్ష్యమని వెల్లడించారు.సమయపాలన పాటిస్తూ సభ్యులంతా సమర్థవంతంగా పాల్గొని సహకరించాలని మున్సిపల్ యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.



## 30 వ తేదీ మంగళవారం వైకుంఠ ఏకాదశి మహోత్సవం..

### - శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వెంకటాపురం కాలనీ..

విభారే న్యూస్ డిసెంబర్ 27 ఎమ్మిగనూరు..స్థానిక వెంకటాపురం కాలనీలో వెలసిన శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నందు 30 వ తేదీ మంగళవారం రోజు వైకుంఠ ఏకాదశి గోవింద నామస్మరణతో కన్నుల పండుగగా జరుగును. భక్తులందరూ విరివిగా పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ అర్చకులు తెలియజేశారు.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**